మహిళలకు రక్షణ కవచం 'దిశ' యాప్

- ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో యాప్ ఉండేలా చర్యలు
- అవగాహన కల్పించి, డౌన్‌లోడ్ చేయించిన మహిళా పోలీసులు
- దిశ చట్టం అమలుతో మహిళలపై తగ్గిన అఘాయిత్యాలు



దిశ యాప్ వినియోగంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు

జూపాడుబంగ్లా: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేశారు. అన్ని పథకాల్లో వారికే ప్రాధాన్యత ఇచ్చారు. అంతేకాకుండా ఆపద సమయాల్లో అక్కాచెల్లెమ్మలను ఆదుకునేందుకు దిశ చట్టాన్ని, యాప్‌ను ప్రవేశపెట్టారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో దిశ యాప్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఆపద సమయంలో మహిళలు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ఫిర్యాదులు చేస్తుండటంతో సత్వరమే పోలీసులు స్పందించి వారికి రక్షణగా నిలిచి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ఒక్క బటన్ నొక్కితేచాలు

మహిళలు దిశయాప్ డౌన్‌లోడ్ చేసుకొని యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే చాలు నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని వారికి రక్షణ కల్పిస్తున్నారు. ఎస్‌ఓఎస్ బటన్ నొక్కడం ద్వారా ముందుగా లొకేషన్‌తో కూడుకున్న సంకేతాలు దిశ కంట్రోల్‌రూంతో పాటు వారికి సన్నిహితులైన వారికి ఫోన్‌కాల్స్ వెళ్తాయి. బటన్ నొక్కేందుకు వెసలుబాటు లేకపోతే యాప్‌లో హ్యాండ్‌గ్ స్సర్ ఆన్‌చేసి మూడుపర్యాయాలు ఫోన్‌ను ఊపినా చాలు. కంట్రోల్‌రూం అధికారులు లొకేషన్‌ను గుర్తించి సంబంధిత ఏరియా పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించటంతో పోలీసులు సత్వరమే బాధితురాలు ఉన్న ప్రాంతానికి చేరుకొని వారికి అవసరమైన సహాయాన్ని అందించి కాపాడుతున్నారు. ఈ యాప్ వినియోగం వల్ల మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు తగ్గినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఇంట్లో నుంచే ఫిర్యాదులు చేస్తుండటంతో భర్తల వేధింపులు కూడా తగ్గినట్లు చెబుతున్నారు. స్మార్టుఫోన్‌లు లేని మహిళలు ఆపద సమయంలో 100 నంబర్‌కు డయల్ చేయడం ద్వారా సత్వర రక్షణ పొందవచ్చు.

75 శాతం స్మార్ట్ ఫోన్లలో దిశ యాప్

నందికొట్కూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 91,652 కుటుంబాలుండగా 2,72,091 మంది జనాభా ఉన్నారు. ఆరు మండలాల్లో 2,16,560 మంది ఓటర్లు ఉండగా అందులో 1,10,418 మంది మహిళలు ఉన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 1.65లక్షల మంది స్మార్టుఫోన్లు కలిగి ఉండగా, 75 శాతం మేర మహిళలు వారి స్మార్టు ఫోన్లలో దిశయాప్‌ను డౌన్‌లోడు చేసుకొని వినియోగిస్తున్నారు. జూపాడు బంగ్లా మండలంలో 8వేల మంది యువతులు, మహిళలు దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారు.



స్మార్టు ఫోన్‌లలో దిశ యాప్‌ను డౌన్‌లోడు చేసుకున్నట్లు చూపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

ప్రతి మహిళకు అవగాహన కల్పిస్తున్నాం

దిశయాప్ వినియోగంపై స్మార్టుఫోన్ కలిగిన ప్రతి మహిళకు అవగాహన కల్పించటంతో పాటు వారి సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించాం. ఆపద సమయంలో దిశయాప్‌ను ఎలా వినియోగించుకోవాలో వారికి అర్థమయ్యేలా వివరించాం. దిశయాప్‌ను స్మార్టుఫోన్ కలిగిన బాలికలు, మహిళలు వినియోగిస్తున్నారు. మహిళలు, విద్యార్థినులు, యువతులు యాప్ డౌన్‌లోడు చేసుకొని అవసరమైన సమయంలో వినియోగిస్తున్నారు. తద్వారా అఘాయిత్యాల సంఖ్య తగ్గిపోయింది.

– మాధవి, సచివాలయ మహిళా పోలీసు, జూపాడుబంగ్లా

యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నా

నేను నాసెల్‌ఫోన్‌లో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నా. మహిళా పోలీసులు దిశయాప్ వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేయటంతో పాటు యాప్‌ను ఎలా వినియోగించాలో వివరించడంతో సెల్‌ఫోన్లో దిశయాప్‌ను డౌన్‌లోడు చేసుకున్నాను. దిశయాప్ వల్ల అనేక ప్రయోజనాలున్నందున స్మార్టు ఫోన్ కలిగిన ప్రతి విద్యార్థి దిశయాప్‌ను డౌన్‌లోడు చేసుకొని వినియోగిస్తున్నారు.

– షేక్‌ముబీనా, ఇంటర్ విద్యార్థిని, జూపాడుబంగ్లా

క్లుప్తంగా

డిగ్రీ పాస్‌కాని విద్యార్థులకు అవకాశం

శ్రీశైలంప్రాజెక్ట్: బ్యాచ్‌లర్ డిగ్రీ చదివి ఇప్పటి వరకు పాస్‌కాని విద్యార్థులకు అవకాశం కలిస్తున్నట్లు శ్రీశైలం ప్రాజెక్ట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం. బుచ్చయ్య మంగళవారం తెలిపారు. 2010వ సంవత్సరం నుంచి 2014వ సంవత్సరం వరకు డిగ్రీ చదివి ఇంతవరకూ పాస్ కాని వారు పరీక్షలు రాసుకోవడానికి రాయలసీమ విశ్వవిద్యాలయం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించి అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.

264 మంది విద్యార్థులు హాజరు

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, గోకవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు 264 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణ అధికారులు ఇబ్రహీం, రఘుస్వామి తెలిపారు. మంగళవారం ఆరవ రోజు బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 325 మంది విద్యార్థులకు గాను 61 మంది గైర్హాజరు అయ్యారని చెప్పారు.

పదో తరగతి పరీక్షలకు 49 మంది గైర్హాజరు

పాములపాడు: మంగళవారం జరిగిన పదోతరగతి జనరల్‌సైన్స్ పేపర్–2 పరీక్షలకు 49 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షాకేంద్రాల చీఫ్‌లు వెంకటేశ్వర్లు, రమణ తెలిపారు. వారు మాట్లాడుతూ ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ఎస్ పరీక్షాకేంద్రంలో 213 మందికి గాను 194 మంది హాజరుకాగా 19 మంది గైర్హాజరయ్యారు. అలాగే మోడల్‌స్కూల్ పరీక్షాకేంద్రంలో 253మందికిగాను 223 మంది హాజరుకాగా 30మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవు



ప్రజలతో మాట్లాడుతున్న బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున

మహానంది: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. మంగళవారం బండిఆత్మకూరు మండలం వెంగళరెడ్డిపేట, ఈర్నపాడు, కడమల కాల్వ తదితర గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామస్తులతో ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు. ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

కొత్తపల్లి: నంద్యాలలో గురువారం జరిగే సీఎం సిద్ధం సభను అందరూ విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో నిర్వహిస్తున్న సిద్ధం సభను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. మండలం నుంచి అధిక సంఖ్యలో అందరూ సిద్ధం సభకు తరలి వెళ్లాలని తెలిపారు.


కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన జె.ఎస్.ఎస్.పి.శర్మ రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు మధుసూదన్ రెడ్డికి అందజేశారు. విరాళాన్ని అందించిన దాతను దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

భ్రూణహత్య చట్టరీత్యా నేరం



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఆడపిల్లలను తల్లి గర్భంలో ఉన్నప్పుడు స్కానింగ్‌ల ద్వారా గుర్తించి చంపేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, పాఠశాల హెచ్‌ఎం శారద తెలిపారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శివపురం, గోకవరం గ్రామాల్లో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చాలామంది ఆడపిల్లల్ని గర్భంలోనే చంపేస్తున్నారని, అందువల్ల ఆడపిల్లలు తక్కువగా ఉన్నారని తెలిపారు. ఆడపిల్లల్ని చదివించాలని, రక్షించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నకుమారి, ఇందిరా కుమారి, షాహినా, మహిళా పోలీస్ రోజా బిందు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మహానంది: బండిఆత్మకూరు కస్తూర్బా పాఠశాలలో ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ద్రాక్షాయని తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అనాథలు, బడిబయట పిల్లలు ఉంటే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఉచిత విద్య, భోజనం, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు.

వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

వెలుగోడు: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రతిపక్ష టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు గట్టి షాక్ తగిలింది. పట్టణంలోని సీపీ నగర్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో సీపీ నగర్‌కు చెందిన మహబూబ్ హుస్సేన్, మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో మా పార్టీకి ఓట్లు వేయకపోయినా సరే అర్హతే ప్రమాణికంగా కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా నవరత్నాలు అందించామన్నారు. పాలనను గడప వద్దకే తెచ్చామని చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నియోజకవర్గాన్ని పాలించిన బుడ్డా కుటుంబం ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు మాజీ ఎమ్మెల్యేకు అభివృద్ధి గుర్తు రాదని, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం విమర్శలు చేస్తుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో రూ.6.10 కోట్లతో సీహెచ్‌సీని నిర్మించామని, వేల్పనూరులో పీహెచ్‌సీని తమ ప్రభుత్వమే నిర్మించిందని గుర్తు చేశారు. ఎన్నికల కోసం తప్పుడు వాగ్దానాలు ఇస్తున్న నాయకులకు ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, సంక్షేమ పాలనను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ జయపాల్, జేసీఎస్ ఇన్‌చార్జ్ తిరుపంరెడ్డి, ఇలియాస్ ఖాన్, షంషీర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలోకి ఎవరూ వెళ్లలేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరూ టీడీపీలోకి వెళ్లలేదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వందల కుటుంబాలు చేరినట్లు ప్రతిపక్ష పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పట్టి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారన్నారు. నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో శిల్పా చక్రపాణి రెడ్డి విజయం సాధించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని తట్టుకోలేక టీడీపీ నేతలు దాక్కున్నారన్నారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీలో నిలువ నీడ లేక, ఆదుకునే అండ లేకపోవడంతో వైఎస్సార్‌సీపీలోకి వచ్చారన్నారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖరరెడ్డి చేతులెత్తేస్తే ఆ పార్టీ నాయకులు మా పార్టీలో చేరి సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలుపొందారన్నారు. టీడీపీ నేతలకే కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నుంచి వలసలు అంటూ తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని, ఒకరిద్దరు చేరితే వందల కుటుంబాలు టీడీపీలో చేరినట్లు వార్తలు రాయించుకుంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గం నుంచి శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, సర్పంచ్ వేల్పుల జయపాల్, మండల కార్యదర్శి కే.రామ్మోహన్‌రెడ్డి, మోతుకూరు నాగేశ్వరరెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి



శిల్పా కార్తీక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నంద్యాల పట్టణంలో ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం వివిధ ప్రాంతాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలను, అభిమానులను కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి పనులు జరగాలన్నా, పేదలు అభివృద్ధి చెందాలన్నా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, ఎమ్మెల్యేగా శిల్పాచక్రపాణిరెడ్డిని గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు నంద్యాలకు చేరుకోవాలని కోరారు. అంతకు మునుపు పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో మాట్లాడి సభకు తరలి రావాలని కోరారు. అలాగే డాక్టర్లు ఖయ్యూమ్, సలాం, లారీ యజమానులు మునీర్, ముర్తుజా, అస్రఫ్‌అలీ, మగ్బూల్, ఖలీల్ తదితరులతో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులను కలిసి సభకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, విజయచౌదరి, మహబూబ్‌బాషా, మునీర్‌బాషా, శివరాం, రాజగోపాల్, లాలు, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలిరండి



మాట్లాడుతున్న రామలింగేశ్వరరెడ్డి

పాములపాడు: ఈ నెల 28న నంద్యాలలో నిర్వహించనున్న మేము సిద్ధం సభను విజయవంతం చేద్దామనివైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను మళ్లీ ఎగుర వేయాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే మనందరి అజెండా కావాలన్నారు. సమావేశంలో తుమ్మలూరు సర్పంచు వరప్రసాద్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, బంగారం మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతను మళ్లీ గెలిపించుకుందాం

- 28న నంద్యాలలో నిర్వహించే బహిరంగ సభకు తరలిరండి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్



తిమ్మాపురం గ్రామంలో ఫ్యాన్ గుర్తుకే మన ఓటు అని నినాదాలు చేస్తున్న వృద్ధులు, దారా సుధీర్

మిడుతూరు: పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందిస్తున్న సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని బైరాపురం, తిమ్మాపురం గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి జగనన్న జనరంజకపాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పే ప్రతిపక్ష నాయకులను నమ్మవద్దన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తోడ్పాటు అందించే వారిని ఎన్నుకోవాలన్నారు. నంద్యాలలో 28న జరిగే బహిరంగ సభకు మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు.

వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించడం బాధాకరం

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న గ్రామ వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించడం బాధాకరమని ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. వలంటీర్లను టెర్రరిస్టులు, స్లీపర్ సెల్స్‌తో పోల్చడాన్ని ఖండించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు కరోనా సమయంలో (విపత్కర పరిస్థితుల్లో) సేవలు చేసిన వారిపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ నాగస్వామిరెడ్డి, ఫణిభూషణ్‌రెడ్డి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నాయకులు మల్లు శివనాగిరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, పుల్లారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, వలి, స్వామన్న, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి తాగునీటి సమస్య

నందికొట్కూరు: పట్టణంలో వేసవి కాలం తాగునీటి సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతీనగర్, హాజీనగర్‌తో పాటు ఆయా నగర్‌లకు మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంచి నీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి కలెక్టర్ నివేదిక అందించామని తెలిపారు.

పురుగు మందుతాగి వృద్ధురాలి ఆత్మహత్య

జూపాడుబంగ్లా: ఆరోగ్యం బాగోలేకపోవటంతో తాటిపాడు గ్రామానికి చెందిన సగినాల శేషమ్మ (76) అనే వృద్ధురాలు పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. తాటిపాడు గ్రామానికి చెందిన సగినాల శేషమ్మ అల్సరు, హైబీపీ, షుగరు, చర్మసంబంధ వ్యాధులతో బాధపడుతూ వైద్యుల వద్ద చికిత్సలు చేయించుకుంటూ ఉండేది. ఎన్ని మందులు వాడినా వ్యాధులు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 21న ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందింది. మృతురాలి కొడుకుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు మేలు



శ్రీశైలంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంటెంపుల్: గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ.రజాక్ తెలిపారు. మంగళవారం శ్రీశైలంలోని 6వ వార్డు పరిధిలోని మేకలబండ, వడ్డేకాలనీ, అన్నదానం లైన్, ఈఓ ఆఫీసు లైను తదితర ఏరియాలలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే శ్రీశైలం అభివృద్ధికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేసిన పనులను వివరించారు. అనంతరం నాయకులు ఎంఏ.రజాక్, టీఎండీ.రఫి, నాయకులు సవమ్మ, కొటమ్మ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెమానులో దారా సుధీర్, సిద్ధార్థరెడ్డి పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న దారా సుధీర్, సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ మంగళవారం పర్యటించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌రెడ్డి, కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, కట్టా రవి వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించి శ్రీ రేణుకా ఎల్లమ్మ తిరునాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పబ్బతి రవి, సింగిల్ విండో చైర్మన్ సతీష్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న ఆలయ సిబ్బంది, పాల్గొన్న ఆలయ అధికారులు

శ్రీశైలంటెంపుల్: ఏప్రిల్ 26వ తేదీన అమ్మవారికి కుంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం అమ్మవారికి ఆలయ సిబ్బంది కొబ్బరికాయలు సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ, శుక్రవారం రోజున ఏ రోజు ముందు వస్తే ఆ రోజు శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ మేరకు కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు మొదలైనవి భక్తులు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో దేవస్థాన ఏఈవో హరిదాసు, స్వామివారి ఆలయ పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

పీలేరు రూరల్ : తమ కంపెనీలో డిపాజిట్ చేస్తే రెట్టింపు ఇస్తామని పలువురి నుంచి డబ్బు వసూళ్లు చేసి మోసం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిందితుడిని అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన ఇనపరాళ్ల బాలన్న అలియాస్ బాలరాజు నంద్యాల టౌన్‌లో ఉంటూ విన్ ఇండియా ఆయుర్వేదిక్ కాస్మోటిక్ అండ్ జనరల్ స్టోర్స్, మహిమా ఆయుర్వేదమ్ అను రెండు కంపెనీలకు ఎండీ అని, పై కంపెనీలపై అకౌంట్‌లు ఓపెన్ చేశాడు. ఆయన స్నేహితుడైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన ఐజాక్‌తో కలసి 2023 మార్చిలో పీలేరుకు వచ్చాడు. పీలేరు పట్టణంలో నివాసం ఉన్న మల్లికార్జున, మురళీ అనే టీచర్లతో పరిచయం చేసుకున్నారు. వారి కంపెనీలో రూ.లక్ష డిపాజిట్ చేస్తే 20 వారాలకు రూ.1.80 లక్షలు ఇస్తామని చెప్పి డిపాజిట్లు చేయించుకున్నారు. అనంతరం సెప్టెంబర్ నెలలో పీలేరుకు చెందిన టీచర్ ఖాదర్‌వలి వద్ద రూ.7.75 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు. అదే విధంగా పీలేరులో సుమారు 50 మంది వద్ద రూ.8 కోట్ల వరకు డిపాజిట్ చేయించుకున్నారు. ఇందులో సుమారు రూ.4 కోట్లు ఇరిగి ఇచ్చి మిగతా డబ్బు మోసం చేశారు. బాధితుడు ఖాదర్‌వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలన్నపై కేసు నమోదు చేసిన పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. పరారీలోఉన్న ఐజాక్‌ను త్వరలో అరెస్ట్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

పగిద్యాల: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నెహ్రూనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వనుముల నాగశేషులు (48) సాయివిజయ చేపల కంపెనీలో దినసరి కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురి పెళ్లి సమయంలో బయటి వ్యక్తుల వద్ద రూ. 2లక్షలు అప్పులు చేశాడు. కూలీ పనితో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురయ్యాడు. పెరిగిపోతున్న వడ్డీల భారంతో అప్పులు తీర్చలేనని మనస్థాపం చెంది గ్రామ శివారులోని చేపల విజయుడు పొలంలో సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. మృతురాలి భార్య ఏసమ్మ ఫిర్యాదు మేరకు ముచ్చుమర్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్ తెలిపారు.